# యథా నివాం

"ఈ రోజుల్లో కాన్వెంటు ప్రారంభించటం అంటే మాటలు కాద్సార్. అందుకు తగిన హంగు, ఆర్భాటం లేకపోతే ఉపయోగం వుండదు. పోటీ తట్టుకోవడం కష్టం." అనునయంగా చెప్పాడు ధర్మారావు.

"నువ్వు ఎన్నయినా చెప్పు ధర్మారావూ! చదువు వ్యాపారం కాదు. కాకూడదు! అంతే" గంభీరంగా అన్నారు గోపాలరావు గారు.

"అయిందదండీ బాబు. ఏనాడో చదువు వ్యాపారంగా మారి పోయింది. డొనేషన్‌లు కట్టి సీట్లు సంపాయించటం, లంచాలు సమర్పించుకొని సర్టిఫికెట్లు సాధించటం సజావుగా సునాయాసంగా సాగిపోతుంటే, చదువు వ్యాపారం కాకూడదంటారేంటి సార్? అయినా మీలా నూటికి ఒకరిద్దరు ఇలా నీతి వాక్యాలు వల్లె వేసినందువల్ల ప్రయోజనం ఏముంటుంది?"

"మనవంతు కర్తవ్యం సవ్యంగా, సక్రమంగా నిర్వర్తించటం తప్పు కాదుగా?"

"అలాంటప్పుడు మరో మార్గం వెతుక్కోవచ్చుగా? స్కూలు పెట్టాలనే ఆలోచనే ఎందుకు?"

"........"

"ప్రాణాల్ని రక్షించాల్సిన డాక్టర్లు లక్షలకు లక్షలు కుమ్మరించి డిగ్రీలు సంపాయించి ప్రాణాలతో చెలగాటమాడుకుంటున్నారు. లాడ్జింగ్స్ టైపులో హాస్పిటల్స్ వెలుస్తున్నయ్. ఆమధ్య నెప్పుడో పేపర్‌లో చదివాను. 'లా'విద్యార్థులు పరీక్షల్లో కాపీలు రాస్తూ పట్టుబడితే కత్తులు చూపి పరీక్షలు రాశారట. రేపు పరీక్షలు పాసయాక న్యాయాన్ని రక్షించే న్యాయమూర్తులు వీరంతా. ఇంకా చదువు వ్యాపారం కాకూడదంటూ వాపోతే మాత్రం ఏమిటిసార్ ప్రయోజనం"

"అవన్నీ నిజాలేనని ఒప్పుకుంటానయ్యా. నువ్వు చెప్పిన విషయాలన్నీ యదార్థాలే. కానీ అంతమంది తప్పు చేస్తున్నారు కాబట్టి మనం మాత్రం ఎందుకు చేయకూడదు అనుకోవడం సమంజసమంటావా?"

"మనం ఒక్కరం నిజాయితీగా వున్నందువల్ల జరిగే మేలేంటండీ, మనం నష్టపోవడం కాక?"

"తృప్తయ్యా! తృప్తి. తృప్తికి మించిన ధనం లేదని ఊరికే అన్నారా?" చిరునవ్వుతో అన్నారు గోపాల్రావుగారు.

"ఊరికేనే కాకపోతే ఏమైనా లంచం తీసుకునే ఈ సామెతలు నీతులు తయారు చేసేరేమో నాకు అనుమానమే గానీ సార్, మీరు కాన్వెంటు పెట్టాలనుకుంటే మాత్రం దానికంటూ కొన్ని ఆకర్షణలుండి తీరాల్సిందేనండీ. అలాంటి దేమీ లేకపోతే మీది వృథా ప్రయాసే అవుతుంది."

"........"

"అసలు పిల్లల డ్రస్ చూడగానే వీళ్ళు ఫలానా స్కూలు పిల్లలు అని గుర్తించేటట్లుండాలండీ. బూట్లూ, సాక్సు, టై, టైకి మనస్కూలు నేమ్ ప్లేటు, ఆ ప్లేటు మధ్యలో ఓ ఎంబ్లమ్. ఇలా ఇలా కొన్ని ఆకర్షణ లేకపోతే మాత్రం మీ శ్రమంతా వృథానే"

"అలాంటి వన్నీనాకు ఇష్టం లేదయ్యా. మన స్కూల్లో చేరే పిల్లలంతా మామూలు బట్టలే వేసుకోవాలి. అంతేకాదు. బూట్లు, సాక్సు వగైరా లేమీ ఉండకూడదు. మరో మాట రిక్షాల్లాంటి సదుపాయా లేమీ ఉండవ్"

"అంటే దాదాపు వీధిబడి అన్నమాట!" చులకనగా అన్నాడు ధర్మారావు.

"దాదాపు అనెందుకు? వీథిబడే అనుకో. అంతకంటే చౌకబారు బడి అనుకో, నా అభిప్రాయంమాత్రం మారదు. అంతే!"

"పిల్లలెవరైనా చేరుతారనే అనుకుంటున్నారా?" హేళన ప్రతిధ్వనించింది ధర్మరావు ప్రశ్నలో.

చేరకపోయినందువల్ల నాకు వచ్చేనష్టం ఏమీలేదయ్యా ధర్మరావూ! నేనేం వేలకువేలు పెట్టుబడి పెట్టి లాభాల కోసం ఆశించటం లేదు భగవంతుడి దయవల్ల పెద్దలు మిగిల్చిన ఈ ఇల్లు, బోల్డంత ఖాళీ స్థలం ఉన్నాయి. నేను రిటైరయ్యాను. ధరవరలు ఇంకెంత ఆకాశాన్నంటినా ఒకపూటయినా తినేందుకు కాస్తో కూస్తో ఉంది. కనీసం ఇంతయినా ఆదాయం వస్తేనే గాని గిట్టుబాటు కాదనే భయమూ దిగులూ నాకు లేవు. చెప్పాను కదా నేను చేయదలుచుకున్నది.

వ్యాపారం కాదని" సూటిగా నిశ్చయంగా తన అభిప్రాయాన్ని చెప్పారు. గోపాల్‌రావుగారు.

"పది మంది పేదపిల్లలకు చదువు చెప్పాలనుకుంటున్నారన్నమాట!"

"పేదపిల్లలేమిటి, ధనవంతుల పిల్లలేమిటి? ఎవరికైనా చెప్తాను వారికైనా వీరికైనా ఓనమాలతోనే చదువు ప్రారంభమయ్యేది, చదువులో తేడా లేవయ్యా తేడా వున్నదల్లా మనుషుల్లోనే"

అసంతృప్తిని తెలియపరుస్తున్నట్లు తలకాయ అడ్డంగా తిప్పాడు ధర్మరావు.

"అసలు నీకో విషయం తెలుసా ధర్మారావూ?" ఏమిటన్నట్లు కనుబొమలు పైకెత్తి చూశాడు ధర్మారావ్.

"పిల్ల లందరికీ పాఠశాలల్లో యూని ఫారం ఎందుకు ప్రవేశపెట్టారో తెలుసా?"

"చెప్పండి"

"కలిమిలేములనే భేదభావం పసి మనసుల్లో చోటు చేసుకోకూడదని, ధనవంతుల పిల్లలు రకరకాల ఖరీదైన బట్టలు వేసుకుని వస్తే పేదవారి పిల్లలు అలాంటి దుస్తులు వారికి లేవని చిన్నబుచ్చుకోవటం వాటికోసం తాపత్రయపడటం ఇలాంటి ఇబ్బంది లేకుండ చేయాలనే సత్సంకల్పంతో యూనిఫారం అనేది ప్రారంభమైనది.

ఆ ఆశయము మరచిపోయి కేవలం స్కూలుకి గుర్తింపు కోసమే యూనిఫారం అవసరం అనేస్థాయికి దిగజారిపోయింది నేటి పరిస్థితి. పూర్వం చదువులలో ప్రావీణ్యతను బట్టి చదువు చెప్ప

టంలో నైపుణ్యాన్ని బట్టి స్కూళ్ళకు గుర్తింపు, గౌరవం కలిగేవి మరిప్పుడో ఫీజుల్ని బట్టి, క్లాసు రూముల్ని బట్టి పిల్లల డ్రెస్సుల్ని బట్టి గుర్తింపు గౌరవం లభిస్తున్నాయి.

"అయినా ఈరోజుల్లో ఏ యూనిఫారంకి విలువుందంటావ్! ఏ డ్రెస్సులకి నైతిక విలువలున్నాయంటావ్ ! నువ్వు చెప్పినట్లు లక్షల్తో డిగ్రీలు కొనుకున్న డాకర్ల తెల్లకోట్లగ్గానీ, పెడ మార్గాలలో పరీక్షలు పాసయిన న్యాయమూర్తుల నల్లకోట్లగ్గానీ. ప్రజారక్షణ చేయవలసిన రక్షకభటుల ఖాకీ బట్టలగ్గానీ, అర్చనలు అభిషేకాలు చేసే పట్టు బట్టలగ్గాని ఏ ఒక్కదానికైనా విలువ ఉందా? ఉంచుతున్నారా?

"అలాంటప్పుడు అసలు ఆశయం' లక్ష్యం మరుగున పడిపోవునప్పుడు యూనిఫారం మోయలేని బరువును తల్లిదండ్రులకు తగిలించడానికి తప్ప ఎందుకు పనికొస్తాయి చెప్పు? ఎవరి సౌలభ్యం కోసం యూనిఫారం ప్రారభించటం జరిగిందో వారికే తలకు మించిన భారంగాతయారయ్యిందయ్యా యూనిఫారం ఈ రోజున" ఆవేదనగా చెప్పారు గోపాల్రావుగారు.

ఆయన ఆవేదనను అర్ధంచేసుకోగలిగాడే కాని రాజీ పడలేకపోయాడు ధర్మారావు.

★ ★ ★

గోపాల్రావు ధర్మరావు చాలా కాలంనుంచి స్నేహితులు. గోపాల్రావు వయసులో తనకంటే పెద్దవాడు కావటంవలన, ఆయన మీద తనకు ఏర్పడిన గౌరవభావంవలన మొదట్నుండి ధర్మారావుకు ఆయనంటేఅభిమానంగా ఉండేది. కాలంగడిచిన కొద్దీ ఆ అభిమానం

పెరిగింది. ప్రతిరోజు కాకపోయినా తరుచుగా ఇద్దరు కలుసుకోవడమూ, కష్టసుఖాలు చెప్పుకోవడమూ జరిగేవి.

గోపాలరావు స్కూలు టీచరుగాచేసి ఇటీవల రిటైరయ్యాడు. ధర్మారావుకు చాలా వ్యాపారాలున్నాయి. ఆ ప్రాంతంలో ఆయనకు చాలా పలుకుబడి ఉన్నది. ఆర్థికంగా ఏ లోటులేదు. ధర్మారావు ప్రోద్బలంతోనే నాలుగైదుసంవత్సరాల క్రితం తాతలనాటి పొలాన్ని అమ్మి పట్టణానికిదూరంగా స్థలం కొన్నాడు. గోపాలరావు తను రిటైరుకాయేముందే చిన్నఇల్లు కట్టు కున్నాడు.ఆయన ఇల్లు కట్టుకునే నాటికి చాలాఇళ్ళు వెలసినయి. ఒక్కొక్క సౌకర్యమే ఆ కాలనీలో చోటు చేసుకున్నది.

ధర్మారావు కున్న పలుకుబడితోనూ ఆర్థికబలంతోనూ ఆ కాలనీలో కూడా వ్యాపారం పెట్టించాడు, కొడుకులచేత తనకున్న సహజమైన వాక్చాతుర్యముతోనూ, కలివిడి స్వభావంతోనూ కాలనీలో అందరితో పరిచయం సంపాదించాడు. చాలామందికి రకరకాల పనుల్లో తను చేయగలిగినంత సహాయంచేశాడు.

ఆ ధైర్యంతోనే తన స్నేహితుడైన గోపాలరావు రిటైరయ్యాక కాన్వెంటు ప్రారంభిస్తానంటే అంగీకరించాడు. తీరా ఆయన అభిప్రాయం తెలుసుకున్న తరువాత కొంత నిరుత్సాహపడినా, తన కర్తవ్యాన్ని నెరవేర్చ దలచుకున్నాడు. మిత్రుడికి తోడుగా నిలవాలని నిశ్చయించుకున్నాడు.

కాన్వెంటు ప్రారభోత్సవం వేడుకగానే జరిగింది. గోపాలరావు

ఊహించనిరీతిలో విద్యార్థులు చేరారు. ఆయన మొదట నిర్మించిన ఒక రెల్లుపాక సరిపోకపోవడంతో వెంటనే మరో మూడు రేకుల షెడ్డులు వేయించాడు.

కాన్వెంటు గోపాలరావుగారి అభిరుచుల మేరకే రూపుదిద్దుకున్నందుకు ఆయనకి మహా సంతోషంగా వుంది.

పట్టణానికి దూరంగా, కాలనీవాసు లందరికీ అందుబాటులో కాన్వెంటు వుండటం చాలా ఆనందం కలగచేసింది. గోపాలరావుగారి గురించి ధర్మారావు చెప్పిన మాటలు, చేసిన ప్రచారమే అంత పెద్ద సంఖ్యలో పిల్లలు చేరటానికి ప్రధాన కారణం. ప్రతి ఇంటికీ వెళ్ళి తల్లిదండ్రు లందరికీ నచ్చచెప్పి, ఆ కాన్వెంటుకు అంతమంది పిల్లలు వచ్చేలా కృషి చేశాడు.

పిల్లల తల్లిదండ్రుల దగ్గర్నుంచి ధర్మారావు మీద వత్తిడి రాసాగింది కొంత కాలానికి. వారందరికీ తను యిచ్చిన హామీ మీదనే వాళ్ళంతా పిల్లల్ని ఆకాన్వెంటులో చేర్చారని గోపాలరావుకు తెలియదు.

ముందుగానే కాలనీ వాసుల్లో చాలా మందితో కలిసి ధర్మారావు రూపొందించిన ప్రణాళిక అమలు చేయవలసిన సమయం వచ్చింది. రోజురోజుకూ తల్లిదండ్రులనుంచి వచ్చే వత్తిడి తట్టుకోలేని ధర్మారావు ఓ రోజున వారందరికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

అంతే ముచ్చటగా మూడు రోజుల్లో కాన్వెంటులో వున్న మూడు వంతుల పిల్ల లందరూ ఖరీదైన యూనిఫారంలో, టై, బూట్లు, సాక్సు వగైరారతో ప్రత్యక్షమయ్యారు.

వారందర్నీ చూసిన గోపాల్రావుగారు అవాక్కయి పోయారు. అంతలోనే ఆయన కళ్ళు ఎరుపెక్కాయి. కోపాన్ని ఆపుకోలేక పోయారు.

అంతలోనే వడివడిగా అక్కడకుచేరాడు ధర్మారావు. "ఆవేశ పడకండి మాస్టారూ! పిల్ల లందరికీ ఇలా యూనిఫారం పెట్టకపోతే సమ్మె చేస్తారట!" చిరునవ్వు దాచుకుంటూ అన్నాడు ధర్మారావు.

ఆ మాటలకు విస్మయం చెందారు గోపాల్రావుగారు. "అంతే కాదు. వారి సమ్మెకూడా మీ అభిప్రాయం మార్చుకోకపోతే పిల్లల తల్లిదండ్రులంతా మీ ఇంటి ముందు నిరాహారదీక్ష ప్రారంభిస్తారట" అమాయకంగా చెప్పాడు ధర్మారావు.

"అయితే నేను ఈ స్కూలు మూసేస్తాను." అన్నారు ఆవేశం గా గోపాల్రావుగారు.

"అబ్బే! అదికూడా మీ చేతులలో లేదు మాస్టారూ! అందుకు కూడా వారు ఇష్టపడరు. మీ కాన్వెంటులోనే చదువు చెప్పించాలట. యూనిఫారం వగైరాలు లేకపోతే వారివారి బంధువుల్లోనూ, సహెూ ద్యోగుల్లోనూ చెప్పుకోవటానికి హుందాగా లేదట పాపం వారికి."

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక—ది. 4-7-90)